సాక్షి
తిరుపతి
శనివారం । 14 । డిసెంబర్ । 2024



ఉత్సాహంగా 'యువఉత్సవ్'
శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. - 8లో



పది వేల ఎకరాల్లో మునక
భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పది వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్టు అధికారులు తెలిపారు. - 8లో



శాస్త్రోక్తంగా చుక్కాని ఉత్సవం
శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాత్రి చుక్కాని ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

16న బాక్సింగ్ పురుషుల జిల్లా జట్టు ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 16వ తేదీ ఉదయం నుంచి 8వ పురుషుల ఉమ్మడి చిత్తూరు జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఆ మేరకు తిరుపతి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కైలాష్ ప్రదాన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ బరువు విభాగాల్లో నిర్వహించే ఈ ఎంపిక పోటీలకు 01-01-1984 నుంచి 31-12-2005 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన బాక్సర్లు ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల బాక్సర్లు ఎంపిక పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

బాల్య వివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: బాల్య వివాహాలను నిర్మూలించడానికి ఐసీడీఎస్ పెద్ద ఎత్తున కృషి చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శుభం బన్సల్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బేటీ బచావో బేటీ పడావో(బాలికలను కాపాడుదాం-బాలికలను చదివిద్దాం) కార్యక్రమాన్ని వివరించారు. చిన్నతనంలోనే వివాహాలు చేయడం ద్వారా వచ్చే అనర్థాలను తెలియజేశారు. ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, డీఆర్‌డీఏ పరిధిలోని పొదుపు సంఘాలు, పోలీసులను సమన్వయం చేసుకుని కౌమార దశలోని బాలికలకు బాల్యవివాహాలతో వచ్చే ఇక్కట్లను సీడీపీఓలు తెలియజేయాలని చెప్పారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి మాట్లాడారు. ఉచిత అత్యవసర హెల్ప్ లైన్ నంబర్ల పోస్టర్‌ను ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆవిష్కరించారు. డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డీఈఓ కేవీఎన్ కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

15న టీటీడీ స్థానిక ఆలయాల్లో కార్తీక దీపోత్సవం

తిరుపతి కల్చరల్: ఈనెల 15న ఆదివారం శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం వేడుకగా నిర్వహించనున్నారు. ఇదే రోజు సాయంత్రం శ్రీపుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి కార్తీక దీపం, వస్త్రాలను ఆలయ ప్రాకారంలో ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పిస్తారు. అలాగే ఆలయంలోని ఉపాలయాల్లో కార్తీక దీపం వెలిగిస్తారు. దీనితోపాటు శ్రీకోదండరామస్వామి ఆలయంలోనూ ఆదివారం సాయంత్రం కార్తీక దీపోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం శ్రీగోవిందరాజస్వామి ఆలయంలోని శ్రీపుండరీకవల్లి అమ్మవారి సన్నిధి నుంచి ఆలయ మర్యాదలతో పడి, కార్తీక దీపం, నూతన వస్త్రాలను ఊరేగింపుగా శ్రీకోదండ రామాలయానికి తీసుకువచ్చి కార్తీక దీపాలు వెలిగిస్తారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 61,178 మంది స్వామిని దర్శించుకున్నారు. 22,464 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.85 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.



ప్లకార్డులతో మహిళలు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డితోపాటు పార్టీ నేతలు, రైతులు

అన్నదాతలు, వైఎస్సార్‌సీపీ నేతలు కదం తొక్కారు. దగా చేసిన కూటమి ప్రభుత్వంపై దండయాత్ర చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కలెక్టరేట్‌కు పోరుబాట చేపట్టారు. జెండాలు చేత బట్టి నినాదాలు మిన్నంటించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి నిధితోపాటు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, రాయితీ రుణాలు ఇప్పించాలని అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

విశేష స్పందన

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలలకే అన్నింటా వైఫల్యం చెందడంతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పోరుబాటకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంచనాలకంటే ఎక్కువగా తరలిరావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కలెక్టరేట్ ముందే జాతీయ రహదారి ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై మొదటి సారిగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమం విజయవంతం కావడంతో కూటమి నేతలు జీర్ణించుకోలేకపోయారు. పోలీసులు, ఇంటెలిజెన్స్ అధికారులకు ఫోన్‌చేసి ఎంత మంది వచ్చారు? ఎవరెవరు వచ్చారు? అంటూ ఆరా తీయడం గమనార్హం.

నినదిస్తూ..నిలదీస్తూ!

హామీల అమలుకు కదం తొక్కిన అన్నదాతలు

- వైఎస్సార్‌సీపీ పోరుబాటకు విశేష స్పందన
- కలెక్టరేట్‌కు భారీగా తరలివచ్చిన రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- 'కూటమి' తీరుపై మండిపడ్డ నేతలు
- డిమాండ్లు పరిష్కరించాలని డీఆర్వోకు వినతి



డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతకు అన్యాయం జరిగింది. పెట్టుబడి సాయం, రైతు భరోసా, రాయితీ రుణాలు, పంటలకు గిట్టుబాటు ధర వంటివేవీ అందించకుండా అన్నదాతను అప్పుల ఊబిలోకి నెట్టింది. వారు ఆత్మహత్యలు చేసుకునేలా వ్యవహరిస్తోంది' అంటూ తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఆ పార్టీ నాయకులు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిరెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు నియోజకవర్గాల సమన్వయకర్తలు భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, నూకతోటి రాజేష్‌తో పాటు జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీగా తరలివచ్చారు.

అన్నదాతకు న్యాయం చేయండి

అన్నదాతకు న్యాయం చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రైతు భరోసా, పెట్టుబడి సాయాలను తక్షణం వారి ఖాతాలకు జమ చేయాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో నరసింహులకు వినతిపత్రం అందించారు.

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచింది. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో పెద్ద ఎత్తున హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదు. తాను అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. అలాగే పంటలకు బీమా సౌకర్యం, గిట్టుబాటు ధర కల్పిస్తానని, 9గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తానని హామీలు గుప్పించారు. ఆయన హామీలు కలగా మిగిలిపోయాయి. రాష్ట్రంలో రైతులు తడిసిన ధాన్యం అమ్ముకోలేక, గిట్టుబాటు ధర లేక, పెట్టుబడి సాయం అందక నానా అగచాట్లు పడుతున్నారు.బాబు చేసిన మోసాన్ని ఎండగట్టడానికి అన్ని జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున పార్టీశ్రేణులు రైతాంగంతో తరలివచ్చి నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమం చేపట్టాం. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

– భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు

రైతుల పక్షపాతి వైఎస్ జగన్

వైఎస్ కుటుంబం రైతుల పక్షాన నిలబడుతుంది. దివగంత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రైతుకు రుణమాఫీ, 9గంటల ఉచిత విద్యుత్ అందిస్తూ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత నిచ్చారు. అదే బాటలో ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల పాలన కొనసాగించారు. చంద్రబాబు రైతులను మభ్యపెట్టి ఓట్లు వేసుకుని అధికారంలోకి వచ్చారు. ఇన్‌పుట్ సబ్సిడీ, గిట్టుబాటు ధర ఇస్తామని, పెట్టుబడి సాయం రూ.20 వేల అందించి ఆదుకుంటామని హామీలిచ్చి విస్మరించారు. అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఒక్క హామీనీ నెరవేర్చలేదు.

– నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం

కబ్జాలో కడివేడు!

- 25 ఎకరాల ప్రభుత్వ భూమి కొట్టేసే కుట్ర
- అధికార పార్టీ నాయకుల భూ దందా
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



పట్రగుంట సమీపం, కడివేడు రెవెన్యూ పరిధిలో ఆక్రమణల జోరు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చిల్లకూరు మండలంలోని కడివేడు రెవెన్యూను టార్గెట్‌గా చేసుకుని తెలుగు తమ్ముళ్లు భూ ఆక్రమణలకు తెగబడుతున్నారు. కడివేడు రెవెన్యూ పరిధిలో అతి పెద్ద సర్వే నంబర్‌గా ఉండే 805లో ప్రభుత్వ భూములు వందల ఎకరాలు ఉన్నాయి. వీటిలో సీలింగ్ భూములు కూడా ఉన్నాయి. వీటిని కొందరు నేతలు లబ్ధిదారుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు డిక్లరేషన్లు ఇస్తున్నారు. దీంతో వారు ఎక్కడ భూములు వదిలారు.. ఎక్కడ తీసుకున్నారు..? అనే విషయాలను రెవెన్యూ సిబ్బంది చెప్పలేకపోతున్నారు. ఇదే అదునుగా కడివేడు రెవెన్యూ పరిధిలోని పట్రగుంట సమీపంలో 25 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి జామాయిల సాగు చేపట్టారు. దీనిపై కొంతమంది నేరుగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

కడివేడు రెవెన్యూలోనే ఇలా..

కడివేడు రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారి వెంబడి ఉన్న ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించుకుని సాగు, వ్యాపారాలు చేసుకుంటున్నారు. గతంలో టోల్ గేట్ ఆనుకుని రూ.4 కోట్ల విలువ చేసే రెండు ఎకరాలలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును వీఆర్‌ఓ బాలాజీ తొలగించారు. అప్పట్లో ఆయన భారీగా ముడుపులు తీసుకుని ఆక్రమణదారులకు రాచబాట వేశారనే విమర్శలు ఉన్నాయి. అలాగే కడివేడు రెవెన్యూ పరిధిలోని పిల్లగుంట సమీపంలో ఉన్న 25 ఎకరాల భూమిని నెల రోజుల క్రితం అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అధికారులను మభ్యపెట్టి చదునుచేసి జామాయిల్ సాగుచేపట్టారు. దీనిపై వీఆర్‌ఓ బాలాజీకి స్థానికులు ఫిర్యాదు చేయగా పట్రగుంటకు చెందిన పేదలు, ఆ నాయకుడికి విక్రయించారని, దీంతోనే సాగు చేపట్టారని చెప్పుకొస్తున్నట్టు సమాచారం. సదరు వీఆర్‌ఓ కడివేడు, తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో రెండు దగ్గరలా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన చేసే ప్రతి పనికీ భారీగా ముడుపులు ఇవ్వాలని ఆ రెండు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూ సేకరణ విషయంలోనూ పేదల నుంచి భారీగానే ముడుపులు తీసుకుని జాబితాలో వారి పేర్లు నమోదు చేస్తున్నట్లు స్థానికులు అంటున్నారు.

కట్టబెట్టేస్తారా?

కడివేడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 805లో వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఆక్రమించుకోవడం జరుగుతోంది. ఈ క్రమంలోనే అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు తన కనుసన్నల్లో 25 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు పెద్ద స్కెచ్ వేశారు. గతంలో ఆ భూమిని పేదలకు పంచి ఉన్నట్లు వారి వద్ద నుంచి అగ్రిమెంట్ విక్రయాలను చేసుకున్నారని తెలిసింది. సుమారు రూ.3 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం.

పరిశీలిస్తా

కడివేడు రెవెన్యూ పరిధిలో 805, 802 సర్వే నెంబర్లలో గతంలో పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూములను కొంత మంది ఆక్రమించి సాగు చేస్తున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదు అందింది. ఈ విషయమై వీఆర్‌ఓతో క్షేత్ర స్థాయిలో పరిశీలించి, రికార్డులు తనిఖీ చేసి చర్యలు చేపడతాం.

– శ్రీనివాసులు, తహసీల్దార్, చిల్లకూరు

ఎస్టీ కాలనీ పరిశీలన



వెదుళ్ల చెరువు ఎస్టీ కాలనీలో కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: మండలంలోని మల్లెమడుగు రిజర్వాయర్ నుంచి రాళ్ల కాలువ ఆనుకొని ఉన్న వెదుళ్ల చెరువు ఎస్టీ కాలనీని శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ఇకపై భవిష్యత్‌లో ఎలాంటి వరదలకు ముంపునకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేశామని, పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఆయన వెంట శ్రీకాళహస్తి ఇరిగేషన్ ఈఈ మదన గోపాల్, తసీల్దార్ సురేష్‌బాబు పాల్గొన్నారు.



కార్తీక అఖండ దీపాన్ని వెలిగిస్తున్న గాండ్ల కులస్థులు (ఇన్‌సెట్) కొండపై కార్తీక దీపం

కార్తీక మాసం, కృత్తికా నక్షత్రం సందర్భంగా శుక్రవారం కపిలతీర్థం కొండ శిఖరంపై కార్తీక అఖండ దీపం దేదీప్యమానంగా వెలుగొందింది. ప్రతి ఏటా తమిళ కార్తీన మాసం, కృత్తికా నక్షతం నాడు తిరువణ్ణామలై కొండపై కార్తీక అఖండ దీపం వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఇదే సంప్రదాయాన్ని తిరుపతిలోని గాండ్ల కులస్థులు పాటిస్తూ వస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం గాండ్లమిట్ట వీధిలోనున్న శ్రీరామ భజన మందిరంలో భక్తి ప్రపత్తులతో సేకరించిన కొత్త కుండ పెంకు, ప్రత్యేకంగా తయారు చేసిన ఒత్తితో పాటు సుమారు 25 కిలోల నూనెకు పూజలు నిర్వహించారు. భజన మందిరం నుంచి గాండ్ల కులస్థులు కాలినడకన కపిలతీర్థంలోని కొండ శిఖరానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపపు గూటిలో కొత్త కుండ పెంకు ఉంచి నూనె పోసి ఒత్తివేసి కార్తీక దీపాన్ని వెలిగించారు. కొందరు భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి కార్తీక దీపాన్ని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. తిరుపతి గాండ్ల కుల సంఘం నేతలు పాతలపాటి శేఖర్, ప్రసాద్, బండారు శ్రీనివాసులు, సాకం ప్రభాకర్, కోదండం, మద్దూరు గిరి, దాము, తిలక్, రాజేంద్రప్రసాద్, పార్థు, కిట్టు, సాత్విక్ పాల్గొన్నారు.

– తిరుపతి కల్చరల్

జర్నలిస్టులపై దాడి సిగ్గుచేటు

- ఆ గూండాలను అరెస్ట్ చేయాలి
- జాప్ రాష్ట్ర కార్యదర్శి కల్లుపల్లి సురేంద్రరెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న జాప్ రాష్ట్ర కార్యదర్శి కల్లుపల్లి సురేంద్రరెడ్డి

తిరుపతి కల్చరల్: పులివెందల నియోజకవర్గం, వేముల మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో నీటి సంఘాల ఎన్నికల కవరేజీకి వెళ్లిన సాక్షి టీవీ శ్రీనివాసులు, కెమెరామన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిపై కొంత మంది గూండాలు దాడి చేయడం దుర్మార్గమని, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జాప్) రాష్ట్ర కార్యదర్శి కల్లుపల్లి సురేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతి జాప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. కెమెరాలను, సెల్ ఫోన్లను లాక్కొని పగులగొట్టే చర్యను తీవ్రంగా పరిగణించి వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడుల నియంత్రణ కమిటీలను ప్రభుత్వం నియమించాలని సూచించారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు నిరసన ర్యాలీ

మీడియా ప్రతినిధులపై దాడిని ఖండిస్తూ తిరుపతి ప్రెస్‌క్లబ్, పలు జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం పది గంటలకు నిరసన ర్యాలీని చేపట్టనున్నట్టు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఈ నిరసన ర్యాలీకి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులందరూ హాజరు కావాలని కోరారు.

హేయమైన చర్య



పులివెందుల నియోజకవర్గం, వేముల మండల కేంద్రంలో నీటి సంఘాల ఎన్నికల కవరేజ్‌కు వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపరచిన వారిపై కేసు పెట్టి వెంటనే అరెస్ట్ చేయాలి. ఈ దాడి హేయమైన చర్య.

– కె.గిరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్

వెంటనే అరెస్ట్ చేయాలి



విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టుల పై దాడి చేయడం దుర్మార్గం. దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి. ఓ రాజకీయ పార్టీకి చెందిన గుండాలు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరచడం నీచాతి నీచం.

– డాక్టర్ ఎం.ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు, ఏపీయూడబ్ల్యూజే

కొత్త చట్టాలు తేవాలి



మీడియా ప్రతినిధులపై దాడులు జరగడం ప్రజాస్వామ్యం. ఈ దాడులతో మీడియా స్వేచ్ఛకు తీవ్ర భంగం వాటిల్లుతోంది. మీడియా రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్త రక్షణ చట్టాలు తేవాలి. వాటిని పటిష్టంగా అమలు చేయాలి.

– కోలా లక్ష్మీపతి, అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్

దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేయడం సిగ్గుచేటు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి తీవ్ర ఆటంకం కలిగిస్తాయి. మీడియా స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుంది. ఈ దాడిని తిరుపతి ప్రెస్ క్లబ్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం.

– ఆర్.మురళీకృష్ణ, తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు

ఆందోళనకరం



కడప జిల్లాలో సాక్షి మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. దాడికి పాల్పడ్డవారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి.

– పీ.బాలచంద్ర, ప్రధాన కార్యదర్శి

అమానుషం



మీడియా ప్రతినిధులపై వరుసగా దాడులు చోటు చేసుకుంటుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇది అమానుషమైన చర్య. ఇలాంటి దుర్మార్గపు దాడులను ఇక ఉపేక్షించం.

– పీ.నరేంద్ర, కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే

క్లుప్తంగా

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



సోదాలు నిర్వహిస్తున్న అధికారులు

తిరుపతి క్రైం: ఉమ్మడి జిల్లాలో ఎరువుల షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ నిబంధనల ప్రకారం బిల్లులు లేకుండా విక్రయించే వారిపై కేసులు నమోదు చేశారు. ఇందులో రొంపిచర్లలో రెండు, మదనపల్లిలో రెండు, ఏర్పేడు-1 తిరుపతి-1 సదుం-2, పుంగనూరులో ఒక కేసు నమోదు చేశారు. సీఐలు చంద్రశేఖర్, వెంకటరవి పాల్గొన్నారు.

స్విమ్స్‌కు రూ.10 లక్షల విరాళం

తిరుపతి తుడా : స్విమ్స్ శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫిలిమ్ డిస్ట్రిబ్యూటర్ కె.వెంకటేశ్వర రావు రూ.10 లక్షల విరాళం ఇచ్చారు. పేద రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిగణనలోనికి తీసుకొని తన మిత్రుడు తిరుపతి వాస్తవ్యుడు వై.రాఘవేంద్ర చేతుల మీదుగా శుక్రవారం చెక్కును స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్‌కు అందజేశారు. దాతకు స్విమ్స్ అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పాత బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేత

సూళ్లూరుపేట: కాళంగి నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ సమీపంలో ఉన్న పాత కాళంగి బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేసినట్టు ఎస్‌ఐ బ్రహ్మనాయుడు తెలిపారు. ముఖ్యంగా లారీలు, బస్సులు, కంపెనీ బస్సులు బ్రిడ్జి మీద వదలమని, హోలీక్రాస్ సర్కిల్ వద్ద నుంచి పట్టణంలోకి రావాలని చెప్పారు. అలాగని ప్రయివేట్ బస్సులు, కంపెనీ బస్సులు ప్రయాణికులు, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోటు..అన్నదాతకు చేటు!

- పౌర్ణమి కావడంతో పోటుమీద ఉన్న సముద్రం
- ఎడతెరిపి లేని వర్షంతో నీటిలోనే నానుతున్న పంటలు
- లబోదిబోమంటున్న అన్నదాతలు



కాదలూరు వద్ద నీట మునిగిన పంట పొలాలు, ఇటుక బట్టీలు

తడ: శుక్రవారం పౌర్ణమి కావడంతో సముద్రం పోటు మీద ఉంది. ఎడతెరిపి లేని వర్షంతో ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా వంకలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాల్లో చేరిన నీళ్లు రెండు రోజులుగా తగ్గు ముఖం పట్టలేదు. గురువారం తడ పరిసరాలతోపాటు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పాములకాలువ, కరిపేటి కాలువ, కాళంగి నది ఉధృతంగా ప్రవహిస్తూ పంట పొలాలను ముంచెత్తాయి. గత నెలలో కురిసిన తుపాను వర్షాలతో నీట మునిగిన పంటలు కొంతవరకు కోలుకుని.. పొట్ట, గింజ దశకు చేరాయి. ఈ నేపథ్యంలో మళ్లీ వర్షాలు కురవడం.. మునకకు గురికావడంతో రైతులు ఆందోళనలో మునిగిపోయారు. దిగుబడి భారీగా తగ్గిపోయే అవకాశం ఉందని పలువురు ఆవేదన చెందుతున్నారు.

రాకపోకలు బంద్

తడ మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాళంగి నది, పాముల కాలువ నీళ్లు రోడ్లపైకి తన్నుకు రావడంతో.. కాదలూరు గ్రామానికి వెళ్లే దారి మునిగిపోయింది. రాకపోకలు సాగించేందుకు నానా కష్టాలు పడాల్సి వస్తోంది. గ్రామానికి మరో వైపున ఉన్న కాదలూరు, వెండ్లూరుపాడు కలుజులు నిండుగా పారుతుండడంతో అటువైపు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే వాటంబేడు, పాములమిట్ట, గోపాల్‌రెడ్డిపాళెం, గొల్లలములువు గ్రామాలకు వెళ్లే దారికి అడ్డంగా గొల్లలములువు రైల్వే గేటు వద్ద కాళంగి నీరు రోడ్డుకడ్డంగా ప్రవహిస్తోంది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వరద ప్రభావిత ప్రాంతాలైన గ్రద్దగుంట, కాదలూరు ప్రాంతాల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పర్యటించారు.

పదివేల ఎకరాల్లో వరి పంట మునక

తిరుపతి అర్బన్: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పది వేల ఎకరాల్లో వరి పంట నీటమునిగినట్టు అధికారులు తెలిపారు. శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గాల్లో చెరువులు పూర్తిగా నిండాయి. కల్యాణ్ డ్యామ్‌కు 70 శాతం నీరు చేరింది. కేవీబీపురంలోని కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తి వేయడంతో సూళ్లూరుపేట-నెల్లూరు జాతీయ రహదారిపైన, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. చిల్లకూరు మండలం, తిప్పగుంటపాళెం మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి.



కాదలూరు వద్ద వంతెనను ఆనుకుని వరద ప్రవాహం



చేనిగుంట, గ్రద్దగుంట గ్రామాల వద్ద మునిగిన వరి



కాదలూరు వద్ద నీటమునిగిన రోడ్డు

వైద్య కళాశాలకు ఫోర్స్ వాహనం వితరణ



ఫోర్స్ వాహనాన్ని అందజేస్తున్న బ్యాంకు అధికారులు

తిరుపతి తుడా : క్యాన్సర్‌పై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎస్వీ వైద్య కళాశాలకు యూనియన్ బ్యాంకు 12 సీట్ల ఫోర్స్ వాహనాన్ని వితరణ చేసింది. యూనియన్ బ్యాంకు జనరల్ మేనేజర్ సీవీఎస్ భాస్కర్‌రావు శుక్రవారం వాహనం తాళాలను ఎస్వీ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. బ్యాంకు జీఎం మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా యూనియన్ బ్యాంకు రూ.20 లక్షల విలువైన ఫోర్స్ వాహనాన్ని అందజేసినట్లు తెలిపారు. పేద రోగులకు వైద్యం అందించడంలో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ డైరెక్టర్ రామ్‌ప్రసాద్, బ్యాంకు మేనేజర్ స్వాతి, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ సునీత, పీఆర్వో వీరకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

కలువాయి: మండలంలోని పల్లకొండలో బుధవారం జరిగిన గోపి హత్య కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. రాపూరు సీఐ విజయకృష్ణ శుక్రవారం పల్లకొండలో గోపి ఇంటిని పరిశీలించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గోపి త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేవాడు కావడంతో ఈ ప్రచారానికి గ్రామం నుంచి వెళ్లే పలువురిని కలువాయి స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఎక్కడెక్కడ ప్రచారం నిర్వహిస్తారు, గోపి వారితో ఎలా ఉండేవాడు..? అనే విషయాలపై ఆరా తీశారు. గోపికి ఎవరితోనైనా ఆర్థిక లావాదేవీల్లో వివాదాలు, కక్షలు ఉన్నాయా..? అనే విషయాల పైనా దృష్టిసారించారు. గోపి ఫోన్‌కాల్ డేటా ఆధారంగా అతనికి సన్నిహితంగా మెలిగిన వారిని కూడా విచారిస్తున్నారు. హత్య జరిగిన తీరును పరిశీలిస్తే ఇది కిరాయి హంతకుల పనే అయ్యి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఇంత దారుణంగా హత్య చేయాలంటే ఆర్థిక వివాదాలు.. లేకుంటే ఎవరితోనైనా అక్రమ సంబంధాలు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆ కోణంలోనూ దర్యాప్తు సాగిస్తున్నట్లు సమాచారం. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పలువురు సీఐలు, ఎస్‌ఐలు, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

16 నుంచి ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు

తిరుపతి కల్చరల్ : పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 16 నుంచి వచ్చే ఏడాది జనవరి 13వ తేదీ వరకు తిరుపతితోపాటు దేశ వ్యాప్తంగా 232 కేంద్రాల్లో ప్రముఖ పండితులతో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఇందుకోసం టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలో అన్నమాచార్య కళామందిరం, కేటీ రోడ్డులోని వరదరాజ స్వామివారి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలను పారాయణం చేస్తారు. 12 మంది ఆళ్వారుల్లో ఒకరైన శ్రీగోదాదేవి ధనుర్మాసం వ్రతం చేశారు. ద్వాపరయుగంలో గోపికలు ఈ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణుని కృపకు పాత్రులయ్యారని భాగవతం దశమ స్కందంలో ఉంది. ఈ వ్రతం ఎలా ఆచరించాలనే విషయాన్ని గోదాదేవి 30 పాశురాలతో కూడిన తిరుప్పావై దివ్యప్రబంధాన్ని లోకానికి అందించారు. ఈ వ్రతాన్ని అందరూ కలిసి చేస్తే గొప్ప ఫలితం ఉంటుందని పండితులు చెబుతున్నారు. ఈ సంప్రదాయం ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వైష్ణవ ఆలయాల్లో తిరుప్పావై శాత్తుమొర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఈ బాదుడేంది బాబు?



నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు, నేతలు

రేణిగుంట: ఆదానితో కుదుర్చుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలను విరమించుకుని పెంచిన విద్యుత్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి హరినాథ్ డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మయ్యగుంట గ్రామం వద్ద శుక్రవారం స్థానిక ప్రజలతో 'విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన' తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ తిమ్మయ్యగుంట దళితవాడలో చంద్రముఖి అనే మహిళ ఇంటికి డిసెంబర్ నెల బిల్లు 254 యూనిట్లకు గాను రూ.1,538 బిల్లు వచ్చిందన్నారు. కూలి చేసుకునే బతుకులీడుస్తున్న ఈ దళిత మహిళపై సర్దుబాటు చార్జీల పేరుతో అధిక బిల్లులు మోపడం సమంజసం కాదన్నారు. ఇలాంటివాటిని తాము వ్యతిరేకిస్తామని ఆయన స్పష్టం చేశారు. సీపీఎం నాయకులు కృష్ణ, ఈశ్వరమ్మ, కుప్పస్వామి, హరినాథ్, వెంకటరమణ స్థానిక ప్రజలు చంగల్ రాయలు, చంద్రముఖి, చంద్ర, పరశురాం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెస్ చాంపియన్ స్వగ్రామంలో సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న గ్రామస్తులు, కుటుంబీకులు

వరదయ్యపాళెం: ప్రపంచ చెస్ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ స్వగ్రామమైన పిచ్చాటూరు మండలం, చెంచురాజుకండ్రిగలో స్థానికులు, ఆయన కుటుంబ సభ్యులు సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచి ఆనందాన్ని వ్యక్తంచేశారు. చిన్న వయసులో ఇంతటి ఘన విజయం మాటల్లో చెప్పలేనిదని వారు కొనియాడారు. సంబరాల్లో స్థానికులు చలపతిరాజు, గ్రామస్తులు ఉన్నారు.

అభినందనలు : గుకేశ్ ఇంతటి ఘన విజయాన్ని సాధించడం తెలుగు ప్రజలతో పాటు సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు ఇది గొప్ప చరిత్ర అని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. ఇలాంటి విజయాలు మరిన్ని సొంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే స్థానిక సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అభినందనలు తెలిపారు.

శాస్త్రోక్తంగా చుక్కాని ఉత్సవం



చుక్కాని వెలుగుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయం (ఇన్‌సెట్) కాలుగుతున్న చుక్కాని

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చుక్కాని ఉత్సవాన్ని శుక్రవారం రాత్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలోని పెద్ద నంది వద్ద తాటిచెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం దానిచుట్టూ తాటాకు మట్టలు కప్పి ఉంచారు. రాత్రి అమ్మవారి ఆలయం వద్ద నుంచి బాలాదీపాలను వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు చేశారు. తర్వాత చుక్కానిని వెలిగించారు. ఈ వేడుకను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈఓ బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించండి

– రెవెన్యూ సదస్సుల్లో టీడీపీ నాయకుడి ఆవేదన



ప్రభుత్వ భూములను కాపాడాలంటూ తహసీల్దార్‌ను కోరుతున్న టీడీపీ నేత బెల్లంకొండ రమేష్

చంద్రగిరి: సీఎం చంద్రబాబు నాయుడు స్వగ్రామానికి అనుకుని ఉన్న ఏ.రంగంపేటలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, వెంటనే వాటిని పరిరక్షించాలని టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బెల్లంకొండ రమేష్ అధికారులను అభ్యర్థించారు. శుక్రవారం మండల పరిధిలోని ఏ.రంగంపేట పంచాయతీలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి అధికారులు వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. అనంతరం టీడీపీ నాయకులు బెల్లంకొండ రమేష్ మాట్లాడుతూ ఏ.రంగంపేటలో కోట్లాది రూపాయాల విలువైన ప్రభుత్వ భూమి ఉందన్నారు. తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారి అనుకుని ఉన్న ఈ భూమిపై కొంత మంది అధికార పార్టీ నాయకులే ఇటీవల ఆక్రమణలకు పాల్పడి, దర్జాగా కబ్జా చేశారన్నారు. దీంతోపాతో పాటు కబ్జాలు, ఇసుక దోపిడీలు, మట్టి మాఫియాలు జరుగుతున్నాయని, వాటిని పరిరక్షించాలంటూ తహసీల్దార్‌ను కోరారు.

తిరుపతిలో పెన్షన్ అదాలత్

తిరుపతి అర్బన్: పెన్షనర్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని విజయవాడ నుంచి విచ్చేసిన సీసీఏ తారాచంద్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బీఎస్ఎన్ఎల్, డీఓటీ పెన్షనర్లుకు సంబంధించి సర్కిల్ క్వార్టర్లీ పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని చేపట్టారు. 60 మంది పెన్షనర్లు హాజరయ్యారు. వారి సమస్యలను పరిష్కరించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. బీఎస్ఎన్ఎల్ డీజీఎం వెంకోబరావు, కృపాజ్యోతి, నాగ మహేష్, శ్రీనివాస్, పద్మజ, కుమారి నీరజ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరుపతి క్రైం: స్థానిక రైల్వే స్టేషన్ ఐదో నంబర్ ప్లాట్‌ఫాంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే సీఐ ఆశీర్వాదం తెలిపారు. సుమారు 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి రైల్వే ప్లాట్‌ఫాంపై పడి ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. అనారోగ్యంతో మృతి చెందినట్లుగా భావిస్తున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించినట్టు వెల్లడించారు. మృతుని వద్ద ఎలాంటి వివరాలు లేవన్నారు. ఆచూకీ తెలిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిరుపతి క్రైం: మొదటి అంతస్తు నుంచి కింద పడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన ఘటన తిరుపతి కొర్లగుంటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కథనం.. కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన వడ్డీ రెడ్డి రాణి భర్త ఎస్. వెంకటేశ్వరరావు(45) సౌత్ సెంట్రల్ రైల్వే స్టేషన్లో సీనియర్ ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటేశ్వరరావుకు ఐదేళ్లుగా హైబీపీ ఉంది. కొర్లగుంటలోని మారుతీనగర్ ఫస్ట్ ఫ్లోర్‌లో నివాసం ఉంటున్నారు. గత నెల 21వ తేదీన భోజనం అనంతరం రాత్రి సమయంలో ఇంటి వరండాలో తిరుగుతున్న సమయంలో మొదటి అంతస్తు నుంచి కింద పడ్డాడు. స్థానికులు గమనించి ఆస్పత్రిలో చేర్పించారు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

26 మందికి జరిమానా

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలంలో బహిరంగంగా మద్యం సేవించిన 26 మందిని శ్రీకాళహస్తి కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున జరిమానా విధించినట్లు సీఐ జయచంద్ర తెలిపారు. అలాగే మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి ఒక్కొక్కరికీ రూ.10,000 చొప్పున జరిమానా విధించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ముందు మరింత కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఉత్సాహంగా 'యువ ఉత్సవ్'



నృత్యం చేస్తున్న యువత

తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, చిత్తూరు నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సాంస్కృతిక కార్యక్రమాలు యువతలో నూతనోత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్, జిల్లా గణాంకాధికారి ఎంసీ బాబురెడ్డి, నెహ్రూ యువ కేంద్రం అధికారి జ్ఞానేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ యువ ఉత్సవ్ లాంటి కార్యక్రమాలు దేశభక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ, పద్యగానం, సైన్స్ ఎగ్జిబిషన్, కల్చరల్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కల్చరల్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ శైలేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది కీలక పాత్ర



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి తుడా: వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషిస్తోందని స్విమ్స్ ఆస్పత్రి డీన్ డాక్టర్ అల్లాడి మోహన్ తెలిపారు. స్విమ్స్ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కంటిన్యూడ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (సీపీడీ) నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో ఏఐతో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని తెలిపారు. రోగికి సంబంధించిన సమాచారం, పరిశోధనపై త్వరితగతిన సమాచారం అందుతోందన్నారు. దీంతో చికిత్స, మానసిక ఆరోగ్యం, ఇతర రోగి అవసరాలకు సంబంధించి వైద్యులు నిర్ణయాలు తీసుకోవడంలో క్లినికల్ నిర్ణయాలు సహాయపడతాయని చెప్పారు. మెడికల్ ఇమేజింగ్ సిటీ స్కాన్, ఎక్సరేలు, ఎంఆర్ఐ వంటి ఇమేజింగ్‌ను విశ్లేషించడానికి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్ల, హైదరాబాదుకు చెందిన డాక్టర్ సత్యవ్రతన్ గోవిందరాజన్, ఐసర్ బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పీవీజీకే శర్మ, ప్రొఫెసర్ బీసీఎం ప్రసాద్, డాక్టర్ వీవీ రమేష్ చంద్ర, డాక్టర్ వనజాక్షమ్మ, డాక్టర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడే సాగునీటి సంఘాల ఎన్నికలు

తిరుపతి అర్బన్: సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. శనివారం ఆయకట్టు రైతులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. భూములు ఉండే రైతులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. జిల్లాలో 599 ఇరిగేషన్ చెరువులకు ఎన్నికలు చేపడుతున్నారు. 1,24,254 మంది పురుషులు, 58,731 మంది స్త్రీలు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఆ మేరకు ఆయకట్టు చైర్మన్‌తో పాటు సభ్యులను ఎంపిక చేసుకుంటారు. అలాగే పిచ్చాటూరు మండలంలోని అరణియార్ ప్రాజెక్టుకు సంబంధించి ఐదు కమిటీలను ఎంపిక చేసుకోనున్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలో 4,387 మంది పురుషులు, 1,083 మంది స్త్రీలకు ఓట్లు ఉన్నాయి. అదేవిధంగా స్వర్ణముఖి ప్రాజెక్టు పరిధిలో 6 కమిటీలను ఎంపిక చేయనుండగా.. ఈ ప్రాజెక్టుకు సంబంధించి 4,415 మంది పురుషులు, 2,293 మంది స్త్రీలకు ఓట్లు ఉన్నాయి. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 610 ఆయకట్టు సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 8.30 నుంచి నామినేషన్ల స్వీకరణ, తర్వాత ఓటింగ్ ఉంటుంది. అనంతరం కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయనున్నారు.



తొండమనాడు చెరువు కలుజు

మేజర్ ప్రాజెక్టు ఎన్నికలు వాయిదా

శనివారం చిన్ననీటి పారుదల శాఖ పరిధిలోని చెరువులకు మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ చెరువులతోపాటు తెలుగుగంగ ప్రాజెక్టు, ఇతర మేజర్ ప్రాజెక్టులకు ఎన్నికలు నిర్వహించడంలేదు.

ఏకగ్రీవం దిశగా చర్యలు

కూటమి సర్కార్‌కు అనుకూలంగా ఉన్న రైతులకు ఆయకట్టు పగ్గాలు కట్టబెట్టేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. తమ భూమికి సంబంధించి పన్ను బకాయిలు లేవని వీఆర్వోల నుంచి పోటీలో ఉండే వ్యక్తులు నో డ్యూస్ సర్టిఫికెట్స్ తీసుకోవాల్సి ఉంది. కేవలం కూటమి సర్కార్‌కు చెందిన వారికి మాత్రమే వీఆర్వోలు నో డ్యూస్ సర్టిఫికెట్స్ ఇస్తున్నట్టు చర్చసాగుతోంది. దీంతో సరైన డాక్యుమెంట్స్‌ను సమర్పించలేకపోతే ఆ కమిటీని కూటమికి చెందిన వారికి ఏకగ్రీవం చేయాలనే ఆలోచనతో ఉన్నట్టు సమాచారం.

పారదర్శకంగా సాగునీటి ఎన్నికలు

పారదర్శకంగా సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహించాలి. ఈ మేరకు ఆర్డీవోలు, నోడల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చాం. పక్షపాతం లేకుండా న్యాయబద్ధంగా ఎన్నికలు చేపట్టాలని స్పష్టం చేశాం. ఎన్నికల సిబ్బందికి ముందే శిక్షణ ఇచ్చాం .పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి వసతులతోపాటు అత్యవసర వైద్యసదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశాం.

– ఎస్.వెంకటేశ్వర్, కలెక్టర్, తిరుపతి జిల్లా